# మనిషీ! నీ విలువెంత?

చీకటి! చీకటి! చిమ్మచీకటి! యెటు చూచినా చీకటి! ప్రళయం ముంచుకొస్తూన్నదన్నట్లు ప్రకృతి ప్రళయతాండవం చేస్తుంది. రత్తాలుకేం పాలుపోలేదు. తన ఇద్దరి పిల్లలను భయంగా దగ్గరకు తీసుకుంది.

"అమ్మా! అర్జునుడి రథం తరలి వెడుతుంది కదే...." రెండవ తరగతి చదువుతున్న సత్తి అడిగాడు.

"అవునేమో ...." అన్నది రత్తాలు. తనకు చదువురాదు, ఈ కథలు రావు. తనంటే కూలి, నాలి చేసి పిల్లలను బడికి పంపుతుంది. తన ఇంట్లో, తన వెనుక పుట్టినవాళ్లు నల్గురు. వారిని తయారుచేసి కూడుపెట్టటమే దినచర్యగా వుండేది.

"అర్జున .. పాల్గున....పార్థ...కిరీటి...." అని పిల్లలు ఒణికిపోతూనే చదువుతున్నారు.

ఈదరగాలితో పాటు సన్నని జల్లు ఇంట్లోకి వచ్చింది....అది ఇల్లుకాదు వాళ్ళు ఇల్లుగా భావించే గుడిసె. అప్పటికే నల్గుసార్లు తడికె కట్టింది రత్తాలు. గాలికి ఉండటంలేదు. పొయ్యిదగ్గర మూలకు ఒదిగి కూర్చుంది, పిల్లలతో.

సన్నగా వరదలా నీళ్లు గుడిసెలోకి రావటం మొదలెట్టాయి.

"అమ్మా! నీళ్ళే...." చిన్నాడు అరిచాడు. ఆ నీళ్లు రత్తాలు కంటికి భయంకరంగా, మృత్యువు నేలమీద పరుచుకున్నట్ట అనిపించింది.

"అమ్మా! ఇప్పుడెలా...." బెంగులుగా చూచాడు పెద్దాడు రంగడు. రత్తాలుకేం పాలుపోలేదు. స్థలం సరిపోదని, యెత్తిపెట్టిన కుక్కిమంచం తీసివేసింది రత్తాలు. ముగ్గురు దానిపై కూర్చున్నారు. మరుక్షణమే రంగడు కెవ్వుమన్నాడు. మంచం ఊగినట్లయింది. రత్తాలు వాడి భుజం పట్టుకుని చీకటి చీల్చుకుని, మూలకు ఆశా, నిరాశల్లా మిణుకు, మిణుకుమంటున్న దీపపు కాంతిలో చూచింది. చెలక తెగి రంగడి కాళ్ళు నేలను ఆనాయి.

"అమ్మా! అయ్యగారింటికి వెళ్దామా?" సత్తి అడిగాడు.

"అయ్యగారిల్లు యెప్పుడో కూలి, నేలమట్టం అయింది కదరా. గోడలే ఉన్నాయి" అన్నది రత్తాలు కొడుకు కాళ్ళు పైకి లాగుతూ.

ఓ వైపు రంధ్రం ఏర్పడడంతో సమంగా కూర్చోలేకపోతున్నారు. ఆ గాలిలో, గుడిసె పై కప్పు లేస్తోంది.

"ఓర్నాయనో, పుట్టి, బుద్దెరిగిన కాడినుండి చూళ్ళేదమ్మా, ఇల్లాంటి ఈదర...." పమిట దగ్గరగా లాక్కుని వణికిపోయింది.

రత్తాలు విజయవాడదగ్గర పల్లెటూర్లో పుట్టినా, పెళ్ళి అయిన తరువాత భర్తతో కూలిపనులు చేస్తూ కృష్ణాజిల్లా మొత్తం తిరిగింది. ఆమె పైనుండే యెన్నో వర్షాలు, వర్షాకాలాలు వెళ్ళిపోయాయి కాని, ఇంత భయంకరమైన వర్షాకాలం, తుఫాను చూడలేదు. రెండు సంవత్సరాల క్రితం కలరాతో భర్త పోయాడు. ఆ ఊళ్ళో ఇల్లూ, పొలం ఉన్నా, యెప్పుడూ విజయవాడ, హైద్రాబాద్‌లో ఉంటాడు అయ్యగారు. ఆయన పొలందగ్గరే గుడిసె వేయించి ఇచ్చాడు. కూలి, నాలి చేసుకుంటూ, ఆయన వచ్చినప్పుడు వంటచేస్తూ, ఇల్లు ఊడ్చి కనిపెట్టుకుని ఉండేది. ఆయనపేరు రామస్వామి. నల్గురు కొడుకులున్నారు. అంతా సంవత్సరానికోసారి పంటలు వచ్చినప్పుడు వస్తారు. రామస్వామి మాత్రం అప్పుడప్పుడు వచ్చి, ఒకరోజుంటే వెడతాడు. ఒకోసారి స్నేహితులతో వస్తారు. ఒకరాత్రి అక్కడ గడిపి, ఏవో పనులంటాడు. రత్తాలుకేం పనులో తెలియవు. వాళ్ళ ఇంటిముందు ఊడ్చి శుక్రవారం, శుక్రవారం కల్లాపి చల్లి ముగ్గులు పెట్టేది. తన పొలంలో గుడిసె వేసుకున్నందుకు చేస్తుంది పని అని ప్రత్యేకంగా దానికేం ఇచ్చేవాడు కాదు. ఆయన వచ్చినప్పుడు వండినదాంట్లో మిగిలిందే మహాప్రసాదం అనుకునేది రత్తాలు. ఆమెకు ఆశలు లేవు, అత్యాశ అంతకంటే లేదు.

జూన్‌లో పెద్దవర్షం రాగానే రామస్వామిగారిల్లు మొత్తం నేలకూలింది. ఎవరి దగ్గరో నాల్గురూపాయలు అప్పుచేసి, విజయవాడ వెళ్ళింది. ఆయన ఇల్లు తెలికగానే కనుక్కుంది. వెళ్ళి ఇల్లు కూలిన సంగతి చెప్పింది.

ఆయనింట్లో యెక్కడ చూచినా లక్ష్మీదేవి తన పదహారు కళలతో నాట్యం చేసినట్టు అనిపించింది. అపర లక్ష్మీదేవిలా ఆయన భార్య తిరుగుతుంటే నిట్టూర్చింది రత్తాలు.

"పెట్టి పుట్టారు" అనుకుంది.

ఆ రోజు అక్కడే వుండి, ఓ పాతచీర అడుక్కుని, తోటకూర అంత రుచిగా వండగలరా అని ఆశ్చర్యపోతూ ఊరుకు వచ్చేసింది.

మూడు రోజుల తరువాత రామస్వామి వచ్చి కూలిన ఇల్లును చూచుకున్నాడు.

"ఈ ఏడు లాభంలేదే రత్తీ. ఎండాకాలంలోనే మళ్ళీ కట్టాలి. ఇంత పెద్ద ఇల్లు యెందుకు? రెండు గదులు వేస్తేచాలు" అన్నాడు.

"ఓ వరండా వెయ్యండి అయ్యా! పెద్దోనలు వచ్చినప్పుడు మాలాటోల్లకు దాపు" అనబోయి మింగేసింది. ఇప్పుడు ఆ మాత్రం తలదాచుకునే అవకాశం కూడా లేదు. చూస్తుండగానే మోకాలిదాకా నీరువచ్చింది. ఈసారి వచ్చిన గాలి దీపాన్ని కూడా తనతో తీసుకుపోయింది.

చీకటి! చిక్కటి చీకటి, కాటుకలాంటి చీకటి!

"రత్తీ....ఒసేయ్....నీళ్ళు వచ్చేసినయే. మేమంతా చౌదరిగారి బంగళాకి యెడుతున్నాము వస్తవా?" కాస్త దూరంలో గుడిసేసుకుని కాపురముంటున్న అప్పలమ్మ పిలిచింది. ఆమె భర్త సింహాద్రి చౌదరిగారి పొలం పనులు చేస్తాడు.

పోతున్న ప్రాణం లేచి వచ్చినట్టయింది రత్తాలుకి.

"సత్తీ....రంగా, గట్టిగా నా చేతులు

మాదిరెడ్డి సులోచన

పట్కోండ్రిరా. నీరు జోరగా వస్తుంది" లేచింది. పమిట రెప, రెః లాడుతుందని నడుముచుట్టు బిగించింది. కుండలు, కర్రలు తప్ప ఆ ఇంట్లో ఏంలేః. ఒంటిమీద గుడ్డలు ఉతుక్కున్నప్పుడు కట్టుకునే రెండో జత చిరుగులు పట్టినా వాటిని తీసుకుని బయటికి వచ్చింది.

"అప్పలమ్మప్పా! నేనొస్తుండానే" అన్నది. సింహాద్రి వచ్చి నేయి అందించాడు. పేద సాదలలో ప్రక్కవాడిని ఆదుకునే కారుణ్యం ఉంది.

గాలికి నాల్గు అయిదుసార్లు బొక్క బోర్లా పడబోయింది. సింహాద్రి పిల్లలు పట్టుకున్నారు.

అరగంట తడిసి, క్రిం, మీద పడి చౌదరిగారి మేడ చేరుకున్నార. అప్పటికే ఇంటినిండా జనం కిట, కిట గాడుతున్నారు. ఆరు మెట్లున్న వరండాలో అయిదు మెట్లు దాటాయి నీళ్ళు.

కొందరు క్రిందా, కొండ పైనా సర్దుకుంటున్నారు. బట్టలు పిండ ని పిల్లలను దగ్గరగా తీసుకుని కూర్చుంది.

"విన్ననే రేడియోలో ప్పారట...." యెవరో అన్నారు.

"అందరికి రేడియోలున్నాయా! ఓ పిల్లవాడికి సైకిలిచ్చి ఊరంతా తిప్పి, చెప్పించాల్సింది" యెవరో చుట్ట పీలుస్తూ అంటున్నారు.

"ఆ(....యెవరికి పట్టింది. .."

అర్ధరాత్రి అందరూ నీళ్ళు ఎక్కువయ్యాయని మేడపైకి చేరుకున్నారు.

రెండు రోజులు పగలూ, రాత్రి తెలియని సుషుప్త్యావస్తలో గడిపారు. ఆ తరువాత గంజి కాచుకుని త్రాగడానికి ఏం మిగలలేదు. చౌదరిగారు, మరికొందరు పెద్దలు కలిసి ఇంత ఏదో పెట్టారు. సాయంత్రం వరకు సహాయక బృందాలు వచ్చాయి. చుట్టు ప్రక్కల ఊళ్ళన్నీ కొట్టుకుపోయాయిట. ఆ ఊళ్లో పాకలు, పెంకుటిళ్ళు పాతకాలంనాటి డాబాలు లేకుండా పోయాయి. చౌదరిగారితో పాటు మరో అయిదారిళ్ళు మిగిలాయి.

భిన్నత్వంలో ఏకత్వం అన్నట్టు, అన్ని పార్టీలవారు అన్ని మతాలవారు సహాయానికి చేతుల అందించారు. పుట్టి బుద్ది యెరిగాక ఈ తుఫాను, ఈ భీకరప్రళయం చూడని వాళ్ళంతా స్థంభించి పోయినట్టుండి పోయారు.

మెల్ల, మెల్లగా కోలుకుంటున్నారు. ఆకుల్లో కట్టిన చారన్నం వచ్చింది. తిన్నారు.

ఆ మర్నాడు యెవరోవచ్చి పాత గుడ్డలు ఇచ్చారు. వెళ్ళి తెచ్చుకున్నారు.

ఆ మర్నాడు మరో దాతవచ్చి స... పళ్ళాలు పంచి పెట్టాడు.


ఆ సాయంత్రం మరోతల్లి వచ్చి ప్లాస్టిక్ గ్లాసులు పంచిపెట్టింది. అందరికి రేషన్ ఇస్తున్నారు. వారం రోజులు గడిచింది.

"మనము అదృష్టవంతులం కొన్నిచోట్ల ప్రాణాలు పోయాయి. ధాన్యం, ఇళ్ళు పోయినా, ప్రాణాలతో మిగిలాం" ... ఇల్లాలు అంటుంది. డాక్టరువచ్చి ఇంజక్షన్ ఇచ్చాడు.

ప్రభుత్వం ఇండ్లు వేసుకోవటానికి తల నూటయాభై రూపాయలు ఇస్తున్నారని రత్తాలు వెళ్ళింది. తన నలుగురు కొడుకుల వాటాలు కూలిపోయాయని, రత్తాలు గుడిసె తను వేయించిందేనని రామస్వామి అంటి వాటా డబ్బు తీసుకున్నాడు.

రత్తాలు నోరు వెళ్ళబెట్టింది.

జూన్ మాసంలో కూలిపోయిన తన ఇంటికి, తుఫాను బాధితులతో కలిసి డబ్బు



తీసుకోవటమా!

అందుకే అన్నారు కరువువచ్చి కాటకం వచ్చినా కలిమి వున్నవాడి బలం పెరుగుతుందే తప్ప తరగదని.

అంత పెద్ద బంగళా, సంపాదించే కొడుకులు, ఆయన ప్రభుత్వంనుండి తీసుకున్న మొత్తం ఆయన భార్య చీర ఖరీదు ఉండదు.

ఎందుకా కాపీనం!

రత్తాలుకు అతన్ని తన గుడిసెకు ఖరీదు అడగటానికి కూడా అసహ్యం వేసింది.

"మరిప్పుడెట్టాగే?" అప్పులమ్మ అడిగింది.

"మాయన్న దగ్గరకు పోతనే అప్ప. ఈ మాత్రం కష్టంజేస్తే ఆడ కూలి గిట్టదా."

ఇద్దరు పిల్లలను తీసుకుని పయాణం అయ్యింది. పాత బట్టలు గిన్నెలు ఓ సంచీలోకి తీసుకున్నది. అప్పులమ్మ, అన్నం పచ్చడిమూట కట్టి ఇచ్చింది.

కలిమి వున్న వాడికి కలిమి బలం వుంటుంది.

అదిలేని అభాగ్యులకు ప్రేమ అభిమానాలే కదా. ఆ వాళ్ళకు తెలుసు, వాళ్ళదగ్గర ఏం లేదని. తిట్టుకున్నా, కొట్టుకున్నా అదే ప్రేమాభిమానంతో వుంటారు.

అప్పులమ్మకు దిగులుగానే వుంది. నడిచి వెళ్ళటం కష్టమేకాని బస్సులు నడవటం లేదు. రత్తాలుకు తనెంత చేసినా పరాయిదాని క్రిందే లెక్క. ఈ కష్ట సమయంలో తన వారి దగ్గరుంటుందేమో, అని సరిపెట్టుకుంది.

"బస్సులు నడుస్తే ఓ సారి రంగన్ని పంపే" అన్నది జీరవోయిన కంఠంతో.

రత్తాలు పిల్లలను తీసుకుని నడుస్తుంది. దానికి దొంగలభయం లేదు. ఒంటరితనం. కొంత ముందుకువస్తే ఇంకా జంతు, మానవ కళేబరాలను తీసి సహాయక బృందంవారు ఖననం చేస్తున్నారు.

నిశ్శబ్దం! మృత్యువులాంటి నిశ్శబ్దంలో పడిపోయిన చెట్లను, కూలిపోయిన ఇళ్ళను, కోల్పోయిన ప్రాణాల తాలూకు శవాలను చూస్తూ ముందుకు నడిచింది.

జీవితం అంటే ఏమిటి?

ఏమో! మేధావులు నిర్వచించలేనిది రత్తాలు ఏం నిర్వచిస్తుంది. ఆమెకు ఒకటే బాధగావుంది. ఇంత ప్రళయం చూసినాక, ఈ శవాలను చూచాక కూడా రామస్వామిలో పరివర్తన కలుగలేదంటే, విరక్తి కలుగలేదంటే ఆశ్చర్యంగావుంది.

పేరుకుపోయిన ఇసుకదబ్బలు దాటి రోడ్డు గుర్తు చేసుకుంటూ విజయవాడ దారిపట్టింది. అదేనో ఇదో అని ఒకరిద్దరిని అడిగింది. అదే అన్నారు.

"అబ్బ నడువలేనే...." సత్తి కాళ్ళు పట్టుకుని ఏడుస్తున్నాడు.

"మరెలా నాయనా!...." ఆమె దిగులుగా చూచింది.

"అమ్మో .... రామసామెయ్యగోరి జీపే ...." రంగడు అరిచాడు.

అతని జీపులో యెక్కటం ఇష్టంలేక పోయినా పిల్లలకోసం రాజీపడక తప్పదు అనుకుంది.

గబ గబ జీపును చేరింది. అక్కడెవరూ లేరు. సంచి, కేరియర్ అయ్యగారివే.

"అయ్యగారూ .... అయ్యగారూ!" రంగడు పిలిచాడు. ఎవరూ పలకలేదు. ప్రక్కనే డొంకలో తెల్లబట్టలు కనిపించాయి.

రత్తాలు ఆదుర్దాగా అటు వెళ్ళింది.

ఆమెకు కళ్ళు తిరిగిపోయాయి. అయినా మరోసారి చూచింది.

రామస్వామి గుడ్లు వెళ్ళబెట్టి వెనక్కు పడిపోయి వున్నాడు. అతని చేతులో మురిగిపోయిన, పదార్థం ఏదో వుంది. ఇంకా పరీక్షగా చూచింది. భరించలేని వాసనగా వుంది. ఒక స్త్రీ కళేబరం వుబ్బిపోయివుంది. కుళ్ళుతున్న కండరాలలోనుండి బంగారు నగలు కనిపిస్తున్నాయి. ఆమె వారిస్తున్నా పిల్లలు దగ్గరగా వెళ్ళారు కుతూహలంగా.

"అమ్మో...యెన్ని నగలే...."

"అబ్బో....వాసన. అయ్యగారి చేతిలో పేగులే...."

"అదిగో .... ఆ సచ్చినావిడ వడ్డాణం తీయబోయాడ్రా...."

"అయ్యగోరండీ...." యెంత లేపినా, పిలిచినా పలుకలేదు. రత్తాలుకు తల తిరిగిపోయింది.

"రండిరా...."

"అయ్యగోర్ని వదిలిపోదామె?" రంగడు అడిగాడు.

"అట్ల రోడ్డుమీద కూర్చుని యెవరన్నా కనిపిస్తే చెబుదాం."

ముగ్గురూ రోడ్డుమీదికి వచ్చారు.

"అమ్మా! బువ్వతింటామె. అయ్యగోరి జీపులో నీళ్లున్నాయి."

"ఊం...." అన్నది చేతిలోని అన్నం మూట క్రింద పెడుతూ.

ఆమెకు భళ్ళున వాంతి వచ్చింది.

"అబ్బ! అయ్యగారికి యెంతాశ! తనకు లేదనా ఆ శవం తాలూకు వస్తువులకు ఆశ పడ్డాడు! పేగులు బయటికి వచ్చేసరికి గుండె ఆగివుంటుంది. అందుకే కళ్లు వెళ్ళబెట్టి పోయాడు, అనుకుంది. తల తిరిగిపోసాగింది రత్తాలికి. అలాగే తలక్రింద చేయి పెట్టుకుని ముడుచుకుని పడివుంది.

చీకటి పడుతుండగా పోలీసు జీపులు, రామస్వామి కొడుకులు వచ్చినప్పటి గల్లంతుకు మేలుకుంది. ఒళ్లు కాలిపోసాగింది.

వాళ్ళు ప్రశ్నిస్తే చూచింది చెప్పింది రత్తాలు.

"అరే ఈవిడ ఒళ్లు కాలిపోతోంది, ఆస్పత్రి చేర్చాలి"కి అన్నాడో యువకుడు. ఆమెను తెచ్చి కూర్చోబెట్టారు.

ఎవరో రామస్వామి కొడుకులను అడుగుతున్నారు.

"శవాన్ని మీ యింటికి తీసుకువెడతారా?"

"ఎందుకు లెండి, ఇక్కడే దహనం చేద్దాం. పాపం ఆమె మా పిన్ని అందుకే ఆగి వుంటాడు మా నాన్న" అన్నాడు రామస్వామి కొడుకు. నిజంగా ఆమె అతని పిన్నేనా అన్నది యెవరికి తెలియదు. కుళ్ళు శవం తాలూకు నగలు అలా అనిపిస్తున్నాయా అని ఆలోచించినవారు లేక పోలేదు.

రామస్వామి దిక్కుమాలిన చావుకు దుఃఖించిన వారొక్క రంగడు, సత్తిగాడే. వాళ్ళకు అయ్యగారొచ్చినప్పుడు తెచ్చే తినుబండారాలు మిగిలినవి తమ కిచ్చేవాడని గుర్తుకు వస్తుంది. అక్కడ శవ దహనానికి ఏర్పాటు చేస్తుంటే రత్తాలు ఎక్కిన జీపు కదిలింది. ఆమె ముడుచుకుని నిదురలోకి జారి పోయింది.

